


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680

సంపుటి : 3 | సంచిక : 354 | ఆగస్టు 25 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న, మన దునియా మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాలు, మండలాలు మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335





**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 24**

కొండా సురేఖ ఉదంతం.. కాంగ్రెస్ సర్కార్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత ఘాటు వ్యాఖ్యలతో మొదలైన ఈ వివాదం వారం రోజుల నుంచి రాజకీయంగా పెద్ద దుమారం రేపుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలపై ప్రభుత్వం ఓ కన్నేసి ఉంచింది. కొందరు ఎమ్మెల్యేలు తనకు వ్యతిరేకంగా కూటమి కడుతున్నారని విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమానించి ప్రచారం జరుగుతున్నది. అందుకే వారి కదలికలపై పోలీస్, ఇంటెలిజెన్స్ అధికారులతో నిఘా పెట్టినట్టు తెలిసింది. అందుకే అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షం అవుతున్నారని చెబుతున్నారు. ఎవరెవరు ఎవరితో మాట్లాడుతున్నారు? ఎవరిని కలుస్తున్నారు? మంత్రులు ఏం చేస్తున్నారో ఆరా తీస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కార్పొరేషన్ చైర్మన్లపై కూడా నిఘా పెట్టారు. శనివారం ఓ అధికార పార్టీ ఎమ్మెల్యే కూతురి వివాహ రిసెప్షన్ హైదరాబాద్ శివారులోని జన్వాడలో జరుగగా, ఈ విందుకు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యాఇలా హాజరైన వారు ఎవరెవరున్నారు? ఎవరెవరు కలిసి వచ్చారు? కలిసి వచ్చినప్పుడు ఎవరు ఎవరితో మాట్లాడుకున్నారన్న దానిపై ఆరా తీసినట్టు తెలిసింది. దీంతోపాటు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న మంత్రి సమీప బంధువుతో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అల్పాహార భేటీకి వెళ్లారు. ఇది పోలీసు వర్గాల్లో సంచలనంగా మారింది. ఏం మాట్లాడుకొని ఉంటారో అనే అనుమానంతో ఆరా తీశారు. విషయాలు తెలుసుకునే క్రమంలో విపరీతంగా ప్రయత్నించారు. చివరకు ఓ ఎస్పీ స్థాయి అధికారి సదరు కార్పొరేషన్ చైర్మన్‌కు ఫోన్ చేసి అన్నా.. ఏం మాట్లాడుకున్నారో చెప్పండి అంటూ రిక్వెస్ట్ చేయడం గమనార్హం. ఇక నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రుల కదలికలపై కూడా నిఘా పెంచారు. సీఎం విదేశీ పర్యటనకు వెళ్లినప్పటి నుంచే నిఘా పెంచామని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ నిఘా విభాగం అధికారి 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు. ఇక ఇటీవల కొండా సురేఖ వ్యాఖ్యల తర్వాత జిల్లాస్థాయిలో కూడా నిఘా వ్యవస్థను అప్రమత్తం చేశామని, పొలిటికల్ ఇంటెలిజెన్స్‌ను యాక్టివేట్ చేశామని ఆ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కదలికలను, ప్రతిపక్ష పార్టీకి చెందిన ముఖ్యనేతల కదలికలను తెలుసుకోవాలనుకుంటున్నదని వారు వెల్లడించారు.

## స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు ప్రజల బ్రెయిన్ వాష్..

### సబ్సిడీ ఎత్తేయాలని కుట్ర:
### రేవంత్ సర్కార్ పై కవిత విమర్శలు

**మన దునియా,హైదరాబాద్: ఆగస్టు 24**

రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లకు దశలవారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఈ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమలకు ప్రభుత్వం ప్రజల బ్రెయిన్ వాష్ చేసే కార్యక్రమం చేస్తోందని ఇందులో భాగంగానే విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల మాటలు, ఇటీవల నెక్లెస్ రోడ్డులో స్మార్ట్ మీటర్ల ఉపయోగం పేరుతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోను రిలీజ్ చేసిన కవిత.. తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పక్షాన కాకుండా పెద్దల

(మిగతా 2వ పేజీలో..)



## సీఎం రేవంత్ తో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం.

### కొండా సురేఖ అంశంపైనే ప్రధాన చర్చ



**మన దునియాహైదరాబాద్:ఆగస్టు 24**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలతో పాటు ప్రధానంగా

(మిగతా 2వ పేజీలో..)

## సారంపల్లి మల్లారెడ్డి మృతిపట్ల హరీశ్‌రావు సంతాపం

**మన దునియా,హైదరాబాద్: ఆగస్టు 24**

కమ్యూనిస్టు ఉద్యమంలో సీనియర్ నాయకుడిగా, రైతు సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు సంఘం నాయకుడిగా సారంపల్లి మల్లారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు అన్నారు. మల్లారెడ్డి మృతి పట్ల హరీశ్ రావు సంతాపం వ్యక్తం చేశారు. రైతుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని

(మిగతా 2వ పేజీలో..)




## నీటిపారుదల శాఖపై రేవంత్ సమీక్ష

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 24**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నారు. భూసేకరణ, పరిహారం పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టి సమీక్షలో ఖరారు చేయనున్నారు. పెండింగ్ భూసేకరణ వేగంగా పూర్తి చేయడంపై అధికారులతో చర్చించనున్నారు. ఇప్పటికే భూసేకరణకు రూ.5 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

పలు ప్రాజెక్టులకు సంబంధించి...

తొలివిడతగా రూ.2,782 కోట్లు విడుదల చేసింది. ఇప్పటివరకు లబ్ధిదారులకు రూ.566 కోట్లు చెల్లించారు. వివిధ దశల్లో మరో రూ.వెయ్యి కోట్ల

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# ప్రభుత్వ భూముల పరిరక్షణే 22ఏ ప్రధాన లక్ష్యం: పొంగులేటి

**22ఏపై ప్రతిపక్షాలది దుష్ప్రచారమన్న మంత్రి పొంగులేటి**

**ప్రజలు ఆందోళన చెందవద్దని సూచన**

**నకిలీ పత్రాలతో భూకబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీగా భూ అక్రమాలు జరిగాయని ఆరోపణ**

**రిజిస్ట్రేషన్లు పూర్తికాని వారికి వారాంతంలోగా ఫీజులు వాపసు చేస్తామని హామీ**




22ఏ నిషేధిత భూముల జాబితాపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో నిన్న నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు, చట్టబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడమే 22ఏ ప్రాథమిక ఉద్దేశమని వివరించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నకిలీ జీవోలు, మెమోలు, సర్టిఫికెట్లతో భారీ ఎత్తున భూదందాలు జరిగాయని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం రికార్డులను ప్రక్షాళన చేస్తూ, ప్రభుత్వ భూములను కాపాడే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారంటూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూములకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో సర్వే నంబర్ 172లోని ప్రభుత్వ భూమిని, సర్వే నంబర్ 173గా చూపి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండాల్సి ఉండగా, గతంలో ముఖ్యమంత్రితో పాటు తన నివాసాలు ఉన్న మొత్తం 1280 ఎకరాలను 22ఏ కింద చేర్చారని, అనంతరం ఆ పొరపాటును సరిదిద్దామని పేర్కొన్నారు. అలాగే మెదక్ జిల్లాలో 522 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పద సీఎస్-7, సీఎస్-14 భూముల వ్యవహారంలో భారీ అక్రమాలు జరిగాయని, ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తే సిట్టింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (సెట్) విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి సవాల్ విసిరారు. 22ఏ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన 980 ఫిర్యాదుల్లో 98 శాతం పరిష్కరించామని, సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్లు పూర్తికాని వారికి ఈ వారాంతంలోగా ఫీజులు వాపసు చేస్తామని హామీ ఇచ్చారు.

# సీఎం రేవంత్ తో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం.

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు, ఆ తదనంతర పరిణామాలపై సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు సమాచారం. గత కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న వివాదాస్పద అంశాలు పార్టీ ప్రతిష్టపై చూపుతున్న ప్రభావం, ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి చర్యలపై ఇరువురు నేతలు విశ్లేషిస్తున్నారు. దీనితో పాటు పాలనాపరమైన అంశాలు, శాఖల పనితీరు, రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల భేటీ ప్రాధాన్యత సంతరించుకోవడంతో కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# సారంపల్లి మల్లారెడ్డి మృతిపట్ల హరీశ్‌రావు సంతాపం

(మొదటి పేజీ తరువాయి)




పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన కీలక పాత్రను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని అన్నారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సహచరులకు హరీశ్ రావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు ప్రజల బ్రెయిన్ వాష్..

(మొదటి పేజీ తరువాయి)

పక్షాన ఉందని పదే పదే నిరూపించుకుంటోందని దుయ్యబట్టారు.

సబ్సిడీ ఎత్తేయాలని కుట్ర:

కార్పొరేట్లతో కుమ్మక్కై విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి పేద ప్రజలకు ఇచ్చే సబ్సిడీ ఎత్తేయాలనే కుట్రకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ముందు మోకరిల్లి వాళ్లు తీసుకొస్తున్న తలా తోక లేని విధానాలను సమర్థిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న మీటర్లన్నీ స్మార్ట్ మీటర్లేనని, ప్రస్తుతం రీడింగ్ కోసం పెన్ను పేపర్?తో ఏమీ రాసుకోవడం లేదు కదా అని ప్రశ్నించారు. రైతు నల్ల చట్టాల ద్వారా రైతులకు ఏ స్మార్ట్ మీటర్లు పెట్టాలని చూసిందో అదే అదానీ కంపనీకి చెందిన స్మార్ట్ మీటర్లను మరో కొత్త పథకం పేరుతో కేంద్రం తీసుకురావాలని చూస్తే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సంతకం పెట్టి స్మార్ట్ మీటర్లు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. అదానీలకు కొమ్ము కాస్తూ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, గృహ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే యూపీలో ఇలాంటి స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పరిస్థితి ఉందని చెప్పారు.

# నీటిపారుదల శాఖపై రేవంత్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

పరిహారం అందచేయనున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌తో పాటు మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టులపై సమీక్షను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయనున్నారు. నెట్టెంపాడు, భీమా, సీతారామ ప్రాజెక్టులపైనా సమీక్ష నిర్వహిస్తారు.



# రాజకీయ సన్యాసం ప్రసక్తే లేదు: మమతా బెనర్జీ

**బీజేపీని కనుమరుగు చేసే వరకు విశ్రమించనని శపథం**

**జనగణన పేరుతో ఎన్ఆర్సీ అమలుకు కుట్ర అని ఆరోపణ**

**అన్నపూర్ణ భండార్ పథకంపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్**

**ఓటర్ల తొలగింపుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి**



తాను రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బీజేపీని అధికార పీఠం నుంచి దించే వరకు తన పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. సోమవారం ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నాలుగు నెలల్లోనే బీజేపీ అసలు స్వరూపం ప్రజలకు అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఎన్ఆర్సీ అమలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జనగణనను ఒక సాకుగా వాడుకుంటోందని ఆరోపించారు. జనగణన దరఖాస్తులపై సంతకాలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'అన్నపూర్ణ భండార్' పథకం కింద ఆర్థిక సాయం అందడంలో జాప్యం జరుగుతోందని, అనర్హత సాకుతో లబ్ధిదారుల సంఖ్యను కుదించడం ఎన్నికల వాగ్దానాలను ఉల్లంఘించడమేనని ఆమె విమర్శించారు.ఇటీవల జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ, వామపక్ష విద్యార్థి సంఘాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల వెనుక బీజేపీ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. క్యాంపస్‌లలో హింసను ప్రేరేపిస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని, వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

## సారంపల్లి మృతి పట్ల కేసీఆర్ సంతాపం

అఖిలభారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సారంపల్లి మల్లారెడ్డి తన జీవితకాలమంతా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నిబద్ధతతో పోరాటం చేసిన గొప్ప రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కొనియాడారు. ఆయన మరణం భారత రైతాంగ పోరాటాలకు తీరని లోటని పేర్కొన్నారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# రైతు బీమాపై సందిగ్ధం..

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 24**

రైతు కుటుంబాలకు అండగా నిలుస్తున్న రైతు బీమా పథకంపై సందిగ్ధం నెలకొన్నది. బీమా గడువు ముగిసి వారం రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు, రైతు కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వారం రోజుల్లో జిల్లాలోని ఆయా గ్రామాల్లో 12 మంది మృతి చెందడం కలవరానికి గురి చేస్తున్నది. యేటా ఆగస్టు 15వ తేదీకి ముందే వ్యవసాయ భూములు పట్టాలు కలిగిన రైతుల పేరిట ప్రభుత్వం ప్రీమియం చెల్లిస్తుంది. కానీ ఈ ఏడాది ఇంతవరకు చెల్లించక పోవడంలో ఆంతర్యమేమిటనే చర్చ జరుగుతున్నది. అయితే రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నుంచి ఇందిరమ్మ బీమా పథకాన్ని అమల్లోకి తీసుకవచ్చిన ప్రభుత్వం దానికి సంబంధించి మార్గదర్శకాలు రూపొందించ లేదు. ఈ పథకాన్ని తీసుక వస్తున్నందున, రైతు బీమా పథకం ఉండక పోవచ్చనే ప్రచారం జరుగుతున్నది.




**రైతు బీమాకు ప్రాధాన్యం**

రైతు కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో 2019 ఆగస్టు 15న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమల్లోకి తీసుక వచ్చింది. రైతులు సహజ మరణం పొందినా, ప్రమాదవశాత్తు మరణించినా కూడా వారి కుటుంబానికి 5 లక్షల రూపాయల పరిహారం అందించే విధంగా ఈ పథకాన్ని రూపొందించి భారత బీమా సంస్థ (ఎల్ఐసీ)తో ఒప్పందం కుదుర్చుకొంది. రైతు కుటుంబానికి అకస్మాత్తుగా రైతు మరణం తర్వాత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందడం వల్ల పంట నష్టాలు, అప్పులు, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలకు కొంత ఊరట లభించింది. ఈ పథకం కింద గతేడాది 96,850మంది రైతులకు ప్రభుత్వం రైతుబీమా కల్పించింది. ఒక్కో రైతుకు 3,400 రూపాయల చొప్పున ప్రభుత్వం 32 కోట్ల 92 లక్షల 90 వేల రూపాయల ప్రీమియం చెల్లించింది. బీమా కాలంలో జిల్లాలో 421 మంది రైతులు మృతి చెందగా, ఒక్కో కుటుంబానికి 5 లక్షల చొప్పున 21 కోట్ల 5 లక్షల రూపాయల పరిహారం అందింది. ఈ గణాంకాలే రైతు కుటుంబాలకు ఈ పథకం ఎంతటి భరోసానిస్తుందో చెబుతున్నాయి.

**12 కుటుంబాల పరిస్థితి ఏమిటి?**

బీమా గడువు ముగిసిన వెంటనే రైతుల మరణాలు చోటు చేసుకోవడంతో ఆయా కుటుంబాలు ఇప్పుడు ప్రభుత్వం వైపు చూస్తున్నాయి. రైతు బీమా కొనసాగుతున్నదా? కొత్త పాలసీకి సంబంధించిన ప్రక్రియ పూర్తయిందా? విషయం తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందు తున్నారు. 5 లక్షల రూపాయల పరిహారం అందుతుందన్న నమ్మకంతో ఉన్న కుటుంబాలకు ఇప్పుడు స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది రైతు బీమా గడువు ఈనెల 14తో ముగిసింది. సాధారణంగా కొత్త బీమా కాలానికి ముందుగానే ప్రీమియం చెల్లింపులు, రైతుల వివరాల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంటుంది. అయితే ఈసారి గడువు ముగిసే వరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన లేకపోవడం రైతుల్లో సందేహాలకు తావిస్తోంది. అసలు ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తుందా, లేదా అనే సంశయం రైతుల్లో నెలకొన్నది.

**పథకం అమలుపై స్పష్టత ఇవ్వాలి..**

రైతు బీమా పథకం అమలుపై ప్రభుత్వం ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రీమియం చెల్లింపు పరిస్థితి, కొత్త బీమా కాలం, అర్హులైన రైతుల సంఖ్య, గడువు ముగిసిన తర్వాత జరిగిన మరణాలకు వర్తించే నిబంధనలు, పెండింగ్ క్లెయిమ్‌ల పరిస్థితిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా ఇప్పటికే జిల్లాలో మరణించిన 12 మంది రైతుల కుటుంబాలకు బీమా పరిహారం అందుతుందా? లేదా? అన్నది ప్రభుత్వం తక్షణమే తేల్చాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా రైతు బీమా పథకం అమలు గురించి స్పష్టత ఇవ్వాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

# ఇవాళ, రేపు వానలు.. బంగాళాఖాతంలో అల్పపీడనం.. 5 జిల్లాలకు ఎల్లో అలర్ట్..

**బంగాళాఖాతంలో అల్పపీడనం.. 5 జిల్లాలకు ఎల్లో అలర్ట్**

**గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు**

**ఎల్లుండి నుంచి తగ్గనున్న వర్షాలు**

**మన దునియా,హైదరాబాద్: ఆగస్టు 24**

రాష్ట్రంలో సోమ,బి మంగళవారం రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని వెల్లడించింది. దీనికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తరించనున్నాయని తెలిపింది. రుతుపవన ద్రోణి కూడా అల్పపీడన కేంద్రం మీదుగా సాగుతుండటంతో వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని, దీని ప్రభావంతో రెండ్రోజుల పాటు రాష్ట్రంలోని పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా సోమవారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వానల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ తన నివేదికలో తెలిపింది. కుమ్రంభీం, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని, ఈ మేరకు ఆయా జిల్లాలకు అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వీటితో పాటు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వెల్లడించారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, బయటకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మంగళవారం కూడా




రాష్ట్రంలోని దాదాపు 22 జిల్లాల్లో ఇదే విధమైన వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆదిలాబాద్ నుంచి కామారెడ్డి వరకు అనేక జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని స్పష్టం చేశారు. బుధవారం నుంచి వర్షాల తీవ్రత తగ్గుముఖం పడుతుందని, ఆ తర్వాత మూడు రోజుల పాటు ఎలాంటి హెచ్చరికలు లేవని అధికారులు తెలిపారు. రైతులు వాతావరణ సూచనలను గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ సిటీలో రాగల 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. నగరంలో గరిష్ట ఉష్ణోగ్రత 30 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 22 డిగ్రీలుగా నమోదయ్యే చాన్స్ ఉందన్నారు. ఆదివారం సాయంత్రం వరకు నగరంలో గరిష్టంగా 32.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, 26.0 మిమీ వర్షపాతం రికార్డయిందని, గాలిలో తేమ శాతం 92గా ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## పెరుగుతున్న స్వైన్‌ఫ్లూ కేసులు

**మన దునియా,న్యూఢిల్లీ ఆగస్టు 23**




ఢిల్లీ, దేశంలోని ఇతర ప్రాంతాల్లో స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. దీనిపై ఐసీఎంఆర్ ఆదివారం ఒక ప్రకటన చేస్తూ హెచ్1ఎన్1కు సంబంధించి ఎలాంటి కొత్త వేరియంట్‌ను గుర్తించ లేదని పేర్కొంది. హెచ్1ఎన్1 సహా కాలానుగుణ ఇన్‌ఫ్లుయెంజా జ్వరం ఎక్కువగా స్వీయ పరిమితం కలిగి ఉంటుందన్నారు. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒంటి నొప్పులు ఈ వ్యాధి సాధారణ లక్షణాలు. పిల్లలు, వృద్ధులు, అనూహ్య వైద్య పరిస్థితుల్లో ఉన్న వారు తీవ్ర సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. కాగా, ఢిల్లీలో ఈ ఏడాది 2,300 ఇన్‌ఫ్లుయెంజా కేసులు నమోదు కాగా, అందులో శుక్రవారం నాటికి 1,777 హెచ్1ఎన్1 కేసులు ఉన్నాయి. ఇందులో 114 హెచ్1ఎన్1 కేసులు కేవలం గురువారమే నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది.

## జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన!

**మన దునియా,రాజన్న జిల్లా:ఆగస్టు 24**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయిలో ప్రతి సోమ వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్ర మంలో భాగంగా... రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవా ల్, సోమవారం ప్రజా వాణి కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ శాఖ ల మండల స్థాయి అధికారుల హాజరు ను పరిశీలించారు. గత వారం ప్రజావాణి కి వచ్చిన దరఖాస్తుల వివరాలను అధికారు లను అడిగి తెలుసు కున్నారు. అలాగే నూతన పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తు లను పరిశీలించారు. పెన్షన్ కోసం అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన అందిం చాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదే శాల మేరకు జిల్లా సమీకృత కార్యాల యాల సముదాయం తో పాటు రెవెన్యూ డివిజన్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగు తుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ మండల కార్యాలయాల్లో నిర్వ హించే ప్రజావాణిని సద్వినియోగం చేసు కుని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## సీసీ రోడ్లకు.. నిధులెప్పుడు?

- కమలాపూర్ మండలంలోని 24 గ్రామాల్లో రూ.2.50 కోట్ల పనులు పెండింగ్
- మంజూరైన పనులకు నిధులు విడుదల చేయాలని సర్పంచుల డిమాండ్
- కలెక్టర్ సమక్షంలో డీఆర్‌డీవోకు వినతిపత్రం,

**మన దునియా కమలాపూర్**



కమలాపూర్, మండల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో కీలకమైన సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులు పెండింగ్‌లో ఉండటంపై సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. కమలాపూర్ మండలంలోని 24 గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంజూరైన సుమారు రూ. 2.50 కోట్ల విలువైన పనులకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సమక్షంలో సర్పంచుల ఆధ్వర్యంలో డీఆర్‌డీవో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పనులు మంజూరైనప్పటికీ నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదని సర్పంచులు పేర్కొన్నారు. నిధులు ఎప్పటిలోగా విడుదల చేస్తారు? మంజూరైన పనులకు నిధులు విడుదల చేసి త్వరితగతిన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చోట్ల రోడ్ల పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. కమలాపూర్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కౌడగాని రాజేష్‌తో పాటు సర్పంచులు కుమ్మరి కుమార్, రవీందర్‌రావు, చేరలు కళ్యాణి, రాజు, ఓదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం విజయ వంతం చేయాలి

**మన దునియా,సిద్దిపేట:ఆగస్టు 24**

సిద్దిపేట:వన మహోత్సవం లో భాగంగా జిల్లాలో 17 లక్షల 68 వేల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ కే హైమావతి అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈనెల 25న నిర్వహించే వన మహోత్సవం మెగా ప్లాంటేషన్ పై జిల్లా మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో వెయ్యి మొక్కలు నాటాలన్నారు. ఇప్పటికే మొక్కలు నాటడానికి 2 లక్షల పైగా గుంతలు సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. మిగతా గుంతలు తవ్వి మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీలతో పాటు అని మున్సిపాలిటీలలో నిర్దేశిత మీద మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇరిగేషన్ శాఖ ఖాళీ భూములలో మొక్కలు నాటాలన్నారు. వనమహోత్సవంలో ప్రజాప్రతినిధులను,ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఆర్ఓ నాగ రాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## జిల్లాలో గవర్నర్ పర్యటన.. ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**



నిజామాబాద్ జిల్లాలో గవర్నర్ పర్యటన.. ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయిచైతన్య పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన గవర్నర్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటించనున్న ప్రతిచోటా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్?లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీపీలు సమావేశమై గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రొటోకాల్?ను పాటిస్తూ గవర్నర్ పర్యటనకు ఎక్కడ కూడా ఏ దశలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మెడికల్ టీం, 108, 104, ప్రత్యేక డాక్టర్ల బృందంను అందుబాటులో ఉంచాలని, వేదిక, సీటింగ్?ను సరి చూసుకోవాలని కలెక్టర్? పేర్కొన్నారు. తాగునీరు, శానిటేషన్ పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులకు బాధ్యతలు పురమాయించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, గవర్నర్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అనుమతి ఉన్న వారు మాత్రమే గవర్నర్ కార్యక్రమాలకు హాజరు కావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీవో సందీప్ పాల్గొన్నారు.

## షాద్‌నగర్ బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పై కేసు

**ఏఐఎస్ఎఫ్ నేత ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ నేత శ్రీకాంత్ లపై కూడా కేసు**

**అనుమతి లేకుండా ధర్నా చేపట్టినందుకు.. కేసు నమోదు**

**జీఓ నంబర్ 97ను వ్యతిరేకిస్తూ ధర్నా చేపట్టడంపై పోలీసుల ఆక్షేపణ**

**ఏఎస్ఐ గోపాల్ ఫిర్యాదుతో తో కేసు నమోదు**




**మన దునియా,షాద్‌నగర్:ఆగస్టు 24**



అనుమతి లేకుండా రోడ్డుపై ధర్నా నిర్వహించి ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారనే ఆరోపణలపై షాద్‌నగర్ పోలీసులు బిజెపి నాయకుడితో సహా ఇద్దరు విద్యార్థి సంఘాల నాయకులపై ఏఎస్ఐ గోపాల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయం సమీపంలోని పాత ఎన్‌హెచ్-7 రహదారిపై కొందరు ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ సంఘాలకు చెందినవారు, బీజేపీకి చెందిన కొందరు వ్యక్తులు గుమిగూడి ధర్నా నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారనీ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి పథకంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలో విలీనం చేయడం, సాంకేతిక విద్యా వ్యవస్థ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన జీఓ నంబర్ 97ను వ్యతిరేకిస్తూ ఈ ధర్నా నిర్వహించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే ధర్నా నిర్వహించేందుకు సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, రోడ్డుపై నిరసన కారణంగా సాధారణ ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని పోలీసులు పేర్కొన్నారు. నిరసనకారులు రోడ్డుపై కూర్చొని నినాదాలు చేస్తూ ధర్నా కొనసాగించినట్లు ఫిర్యాదులో తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ సంఘాలకు చెందిన ఆకాష్ నాయక్, శ్రీకాంత్‌తో పాటు బీజేపీకి చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మరియు అతని అనుచరులపై కేసు నమోదు చేశారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 731/2026గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 223, 126(2) ఆర్/డబ్ల్యూ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తును ఎస్ఐ ఆర్. ప్రణయ్ కుమార్‌కు అప్పగించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు ఆలస్యంగా ఈ అంశం మీడియాకు వెలుగు చూసింది..

# జర్నలిస్టుల ఇళ్ల పట్టాలపై కదలిక





- **అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అండగా ఉంటాం**
- **రిలే నిరాహార దీక్షలకు విరమణ**

**మన దునియా హుజురాబాద్ నియోజకవర్గం**

హుజురాబాద్,జర్నలిస్టుల ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల పట్టాల విషయంలో పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు.హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సోమవారం ప్రణవ్ సందర్శించారు. అనంతరం దీక్ష చేస్తున్న జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఇచ్చిన ఇళ్ల పట్టాల విషయంలో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి





**డిచ్ పల్లి, జక్రాన్ పల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి సోమవారం డిచ్ పల్లి మండలంలో పర్యటించారు. తొలుత మండలంలోని ఘన్ పూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ అఫ్సర్ పాషా ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని అభయమిచ్చారు. మీడియా ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడి.. పలు విషయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి అందాల్సిన సహకారం అందిస్తామని .. కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.అనంతరం మిట్టపల్లి లో సొసైటీ మాజీ డైరెక్టర్, పార్టీ సీనియర్ నాయకులు కీ॥శే॥ సుంకిటీ సాయన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అభయమిచ్చారు.అనంతరం రాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కీ ॥శే॥ ఎర్ల లింగన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.అటు ఇందల్వాయి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన పార్టీ నాయకులు లింబాద్రి కి మాతృవియోగం కలిగింది. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అనంతరం కొత్తపేట-నర్సింగపూర్ గ్రామానికి చెందిన సుంకి సుంకె మహేష్ ఇటీవల ఖతర్ లో మరణించగా గ్రామంలో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రభుత్వం నుండి అందాల్సిన రూ.5 లక్షలతో పాటు బెనిఫిట్స్ అందేలా చూస్తామని.. చెప్పారు.అధైర్యపడొద్దని పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం కమలాపూర్ గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ డైరెక్టర్ రాజేశ్వర్, అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు కమ్మరి గంగాధర్ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాకారం అందించి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అటు జక్రాన్ పల్లి మండల పడకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అరుణ్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం చింతలూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్న రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు అంబర్ సింగ్,(డిచ్ పల్లి), చింతల కిషన్(ఇందల్వాయి), సంజయ్ (జక్రాన్ పల్లి), నాయకులు పొలసాని శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, రాంచందర్ గౌడ్, సాయి రెడ్డి, అమృతాపూర్ గంగాధర్, వాసు, ధర్మాగౌడ్, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు

# సింగారం గ్రామంలో పూరీల్లు నేలమట్టం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్న బాధితులు

**మన దునియా, వాజేడు,ఆగస్టు 24**

భారీ వర్షాల కారణంగా సింగారం గ్రామంలో నిరుపేద పేద కుటుంబానికి చెందిన పూరీల్లు పూర్తిగా కూలిపోయింది కన్నాయిగూడెం మండలం సింగారం గ్రామానికి చెందిన దేపాక వెంకటి కుటుంబం నివసిస్తున్న ఇల్లు భారీ వర్షానికి నేలకొరిగింది ఈ ప్రమాదంలో ప్రాణా నష్టం జరగకుండా బయటపడ్డారు ఇల్లు పూర్తిగా దెబ్బ తినడంతో పిల్లలతో కలిసి కుటుంబ సభ్యులు తలదాచుకునేందుకు సురక్షితమైన వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కూలిన ఇంటిని అధికారులు వెంటనే పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి తక్షణమే ఆర్థిక సాయం అందించాలని బాధితులు కోరుతున్నారు బాధ్యత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు వర్షాకాలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలోని శిథిల వ్యవస్థలో ఉన్న ఇళ్లను అధికారులు గుర్తింపు ప్రమాదంలో ఉన్న కుటుంబాలను ముందస్తుగా పునరావసం కల్పించి



శిధిలావస్థలో ఉన్న ఇండ్లను తీసివేయాలని గ్రామస్తులు కోరుకున్నారు ముందు గుర్తించడం వలన ప్రాణా నష్టం లాంటి ఇబ్బందులు కలగకుండా ఉంటాయని గ్రామస్తులు కోరుతున్నారు

# ఎన్నారై సంక్షేమానికి ఫిలిప్పీన్స్ మోడల్‌ను తెలంగాణలో అమలు చేస్తాం






- త్వరలో సీఎంకు అధ్యయన నివేదిక.. గల్ఫ్ అండ్ అదర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుకు చర్యలు
- ఫిలిప్పీన్స్ లో గల్ఫ్ వెళ్లిన వారి సంఖ్య ఎక్కువ.. అందుకే అక్కడ పర్యటన
- కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోంది.. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలను అడ్డుకోవడం సరికాదు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

విదేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ ప్రవాసులు, వలస కార్మికుల సంక్షేమానికి మరింత పటిష్టమైన విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అన్నారు. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం తమ దేశ పౌరుల కోసం అమలు చేస్తున్న వలస సంక్షేమ విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణలోనూ అనుసరించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందే పీసీసీ అధ్యక్షుడి నేతృత్వంలో ఎన్నారై పాలసీ తీసుకురావడంతో పాటు గల్ఫ్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు భూపతి రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నారై అడ్వైజరీ బోర్డును ఏర్పాటు చేసిందని, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి వినోద్ కుమార్ చైర్మన్‌గా, మంద భీంరెడ్డి వైస్ చైర్మన్‌గా, విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు తాను, మరో 11 మంది నిపుణులతో కమిటీ పనిచేస్తోందని వివరించారు. ఎన్నారై సంక్షేమానికి అవసరమైన చర్యలపై అధ్యయనం చేసేందుకు గత మే నెలలో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన కమిటీ, ఆగస్టు 17 నుంచి 21 వరకు ఫిలిప్పీన్స్‌లో పర్యటించిందన్నారు. ఫిలిప్పీన్స్‌కు గల్ఫ్ దేశాలతో సంబంధం ఏమిటని కొందరు ప్రశ్నించినప్పటికీ ఆ దేశ ప్రజలు పెద్ద సంఖ్యలో ఇతర దేశాలకు వలస వెళ్తున్నందున, వారి సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను పరిశీలించడమే పర్యటన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌లో స్కిల్డ్, నాన్-స్కిల్డ్ రంగాల్లో పెద్ద సంఖ్యలో వలసదారులు ఉన్నారని, 1990ం నుంచే అక్కడ వలస కార్మికుల కోసం సమగ్ర చట్టాలు, విధానాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. పర్యటనలో ఉన్నతాధికారులు, భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు, ఫిలిప్పీన్ లేబర్ మైగ్రేషన్, సెంటర్ ఫర్ మైగ్రెంట్, బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్, బీడబ్ల్యూఐ గ్లోబల్ తదితర సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు.

మూడు దశల్లో వలసదారులకు రక్షణ

ఫిలిప్పీన్స్ మోడల్‌లో విదేశాలకు వెళ్లే వారికి మూడు దశల్లో రక్షణ కల్పిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. మొదటగా విదేశాలకు వెళ్లే ముందు ప్రీ-మైగ్రేషన్, ప్రీ-డిపార్చర్ శిక్షణ ఇచ్చి అవసరమైన నైపుణ్యాలు, అవగాహన కల్పిస్తారని చెప్పారు. రెండో దశలో విదేశాల్లోని సంబంధిత సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని వేతనాలు, రవాణా, ఇతర ప్రయోజనాలపై రక్షణ కల్పిస్తారని తెలిపారు. మూడో దశలో వివిధ దేశాల్లో ఎన్నారై సెల్‌లను ఏర్పాటు చేసి, వలసదారులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తారని వివరించారు. ఎంబసీలలో లీగల్ అడ్వైజరీ సెల్‌లు ఏర్పాటు చేయడం, అనివార్య కారణాలతో స్వదేశానికి తిరిగి వచ్చిన వారికి పునరావాసం కల్పించడం, తిరిగి ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి విధానాలు కూడా ఫిలిప్పీన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ఫిఫా ఖతర్ దోహా క్రీడల సమయంలో వలస కార్మికుల హక్కులు, సమాన వేతనాల కోసం జరిగిన పోరాటాన్ని కూడా ఈ సందర్భంగా ఉదాహరణగా ప్రస్తావించారు. వలసదారుల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని వారి సంక్షేమానికి వినియోగించే విధానాన్ని కూడా అధ్యయనం చేసినట్లు భూపతి రెడ్డి తెలిపారు. ఫిలిప్పీన్స్‌లో అమలవుతున్న విధానాలను తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించి అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

యువతకు నైపుణ్యాలు.. ఉపాధి అవకాశాలు

తెలంగాణలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే అన్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చడంతో పాటు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని తెలిపారు. విదేశాలకు వెళ్లే యువతకు వివిధ భాషల్లో నైపుణ్య శిక్షణ అందించే దిశగా కూడా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రవాస భారతీయుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాభవన్‌లో ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నామని, విదేశాల్లో మృతి చెందిన వారిని స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్ పర్యటనకు సంబంధించిన సమగ్ర నివేదికను మరికొన్ని రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేస్తామని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో చర్చించి గల్ఫ్ అండ్ అదర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్ తరహాలో తెలంగాణలోనూ సమగ్ర ఎన్నారై సంక్షేమ మోడల్‌ను అమలు చేస్తామని అన్నారు.

కేంద్రం తెలంగాణకు రావాల్సిన నిధులు ఇవ్వడం లేదు

రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అనేక హామీలు ఇంకా పూర్తిగా అమలు కాలేదని ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆరోపించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి ఆదాయం వెళ్తున్నప్పటికీ, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తగిన న్యాయం చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ యువతకు ఉపాధి, పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడం, అంతర్జాతీయ అవకాశాలను పెంచడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నాలను రాజకీయ కారణాలతో కేంద్రంలోని బీజేపీ అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, విభజన హామీల అమలు, రాష్ట్ర హక్కుల గురించి కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన సమయంలో ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. తెలంగాణ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెట్టుబడులను ఆకర్షించడం, విదేశీ సంస్థలతో సంబంధాలు పెంచడం కోసం ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం సహకరించాలని డిమాండ్ చేశారు. కుటుంబాలను, స్వదేశాన్ని వదిలి విదేశాలకు ఉపాధి కోసం వెళ్తున్న తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భూపతి రెడ్డి అన్నారు. ఫిలిప్పీన్స్ తరహాలో ముందస్తు శిక్షణ నుంచి విదేశీ ఉపాధి, అక్కడి భద్రత, చట్టపరమైన సహాయం, తిరిగి వచ్చిన తర్వాత పునరావాసం వరకు సమగ్ర విధానాన్ని రూపొందించి అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, పొలసాని శ్రీనివాస్, సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షులు సాయి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాగారెడ్డి, అంబర్ సింగ్, చింతల కిషన్, మోహన్, హన్మండ్లు, జలందర్ రెడ్డి, రాంచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్‌పే క్యూఆర్ కోడ్ స్కామ్..

**ఎస్సై పేరు చెప్పి అమాయకుడికి రూ.78,500 టోకరా!**

**మన దునియా,కేసముద్రం:ఆగస్టు 24**

పోలీస్ ఎస్సై పేరుతో ఓ వ్యక్తిని నమ్మించి రూ.78,500 కాజేసిన సైబర్ మోసం కేసముద్రంలో వెలుగుచూసింది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం గ్రామానికి చెందిన దేశబోయిన కుమారస్వామి నెల్లికుదురులోని శివకేశవ వైన్స్‌లో కౌంటర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 18న రాత్రి ఇంటి వద్ద ఉన్న కుమారస్వామికి ఓ గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను నెల్లికుదురు ఎస్సైని అంటూ పరిచయం చేసుకున్న వ్యక్తి.. తన డ్రైవర్ ద్వారా రూ.25 వేలు నగదు పంపిస్తానని, ఆ నగదును ఫోన్‌పే ద్వారా తిరిగి పంపించాలని కోరాడు. అనంతరం వాట్సాప్‌లో క్యూఆర్ కోడ్ పంపించడంతో నిజమేనని నమ్మిన కుమారస్వామి రూ.25 వేలను ఫోన్‌పే ద్వారా పంపించాడు. మరుసటి రోజు 19న ఉదయం మళ్లీ అదే వ్యక్తి ఫోన్ చేసి రూ.23,500 పంపించాలని కోరాడు. అనంతరం మధ్యాహ్నం మరోసారి ఫోన్ చేసి రూ.30 వేలు పంపించాలని చెప్పి క్యూఆర్ కోడ్ పంపించాడు. దీంతో కుమారస్వామి ఆ మొత్తాన్ని కూడా ఫోన్‌పే ద్వారా బదిలీ చేశాడు. ఇలా మొత్తం రూ.78,500 పంపించాడు. అయితే డ్రైవర్ నగదు తీసుకుని రాకపోవడంతో కుమారస్వామి రాత్రి వరకు ఎదురుచూశాడు. అనుమానం వచ్చి ఫోన్ చేసిన నంబర్‌కు తిరిగి కాల్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు చెప్పగా, తాను డబ్బుల కోసం ఎలాంటి ఫోన్ చేయలేదని ఎస్సై స్పష్టం చేశారు. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు తెలుసుకున్న కుమారస్వామి వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అనంతరం కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు. ప్రజలు గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, క్యూఆర్ కోడ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు



# సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడి ఎన్నిక చెల్లదు..



**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లాలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఓవ్యక్తి స్వయంగా ప్రకటించుకున్నాడని అతడి ఎన్నిక చెల్లదని ఫోరం జిల్లా అధ్యక్షుడు మునిపల్లి సాయిరెడ్డి వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాలో సర్పంచ్?ల ఫోరం అధ్యక్షుడిగా ఓ వ్యక్తి స్వయంగా ప్రకటించుకున్నా డని.. అతడి ఎన్నిక చెల్లదని సర్పంచ్?ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మునిపల్లి సాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వయంప్రకటనపై అభ్యంతరం ఈ సందర్భంగామునిపల్లి సాయిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని సర్పంచ్‌లకు, అలాగే 32 మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక వ్యక్తి తానే జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం చెల్లదన్నారు. జిల్లాలోని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులందరి అభిప్రాయాలు, సమన్వయం లేకుండా స్వయంగా జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులకు ఎలాంటి సమాచారం లేకుండా తీసుకున్న నిర్ణయాలకు గుర్తింపు లేదని తెలిపారు.

**సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం..**

జిల్లాలో సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం ఫోరం నిరంతరం పనిచేస్తోందని సాయిరెడ్డి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలు, సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోరం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా జీపీల సమస్యలు, సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని చెప్పారు. సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఫోరం కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి, బాల్కొండ ఇన్‌ఛార్జి సునీల్‌రెడ్డి తదితరులు సానుకూలంగా స్పందిస్తున్నారని ఫోరం ప్రతినిధులు తెలిపారు.

**పూర్తి మద్దతు ఉంది..**

అనంతరం ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ.. జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మునిపల్లి సాయిరెడ్డికి జిల్లాలోని అన్ని మండలాల సర్పంచ్‌ల మద్దతు ఉందని తెలిపారు. జిల్లాలోని 300 మందికి పైగా సర్పంచ్‌లు ఆయనకు అండగా ఉన్నారని, ఫోరం అధ్యక్షుడిగా ఆయనకు తమ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి అరికెల జనార్దన్, ఉపాధ్యక్షులు చింతం ఉమారాణి సంజీవ్, రూరల్ అధ్యక్షులు వాసు, మండలాల అధ్యక్షులు సుదర్శన్, భూమేశ్, శ్రీను, జలేందర్, రాజు, మోహన్, నీలిమా సాయగౌడ్, శ్రీనివాస్‌తో పాటు దాదాపు 25 మంది సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# తాగి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష,

**ఇందల్వాయి, ఆగస్టు 24 .మన దునియా**



వారం రోజుల క్రితం ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న క్రమంలో దొరికిన1 రాథోడ్ శంకర్ S/O దేవ్ జీ, వయస్సు:43 సంవత్సరాలు, వృత్తి : వ్యవసాయశీ ,అంతర్నీ కుబీర్ మండలం నిర్మల్ జిల్లా.అతనిని ఈరోజు కోర్టులో హాజరుపరచగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి బాలరాజు నిజామాబాద్ గారు 7 రోజులు జైలు శిక్ష విధించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై బి సుమలత మాట్లాడుతూ మాదకద్రవ్యాలు మత్తుపదార్థాలు యువతను చిన్న భిన్నం చేస్తున్నాయని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలు సేవించిన కలిగి ఉన్న విక్రయించిన కఠిన శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. తాగి వాహనాన్ని నడపడం చట్టరీత్యా నేరం కావున తాగి వాహనాలు నడపకండి. ఎస్సై సుమలత, ఓ ప్రకటనలో తెలిపారు.

మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం

## రూపారెడ్డి హత్యను ఖండిస్తున్నాం : ట్రస్మా

**ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిసున్నామని ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నిత్యానందం అన్నారు.**

**నిజామాబాద్ నగరంలో భారీ ర్యాలీ : నిరసన ర్యాలీ**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**




నల్గొండ జిల్లాలో పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిసున్నామని ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహ గౌడ్, జిల్లా అధ్యక్షుడు నిత్యానందం అన్నారు. సోమవారం నగరంలో ట్రస్మా ఆధ్వర్యంలో కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ట్రస్మా ఆధ్వర్యంలో నిజామాబాద్ ఉపాధ్యాయుల భద్రతకు చర్యలు తీసుకోవాలి నగరంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల ప్రైవేట్ స్కూల్, యాజమాన్యాల ఉపాధ్యాయుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీ సాయి చైతన్యకు మెమోరాండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యకు గురైన సంఘటన విద్యా రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యాసంస్థలను నిర్వహిస్తూ సమాజానికి సేవ చేస్తున్న ఒక మహిళా పాఠశాల నిర్వాహకురాలు ఇలాంటి దారుణ ఘటనకు గురికావడం అత్యంత బాధాకరమని తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు.

ట్రస్మా నిజామాబాద్ భవిష్యత్తు తీర్చిదిద్దే వారిపైనే..

పాఠశాల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ప్రతిరోజు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని జయసింహ గౌడ్? పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం వల్ల విద్యారంగంలో పనిచేస్తున్న వారిలో భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ట్రస్మా తరఫున కొన్ని డిమాండ్లను సీపీ దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. రూపారెడ్డి హత్య కేసును అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి, నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రస్మా జిల్లా సెక్రెటరీ అరుణ్, జిల్లా కోశాధికారి ఉప్పల మధు, నరసింహారావు, మోహన్, జనార్ధన్, పృథ్వీ, పాఠశాల శ్రీనివాస్, నాగరాజు, రమేష్, ప్రభాదేవి, కవితా, ధర్మరాజు, రమేష్, నవోదయ పాఠశాల ప్రిన్సిపల్, రమేష్, సిద్ధార్థ్ హై స్కూల్, నందిపేట్ మండల మాజీ అధ్యక్షుడు దేవన్న, పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో ముదురుతున్న అసమ్మతి..

**క్రమశిక్షణకు సవాల్**

**ఎవరికివారే సీనియర్లమనే భావన..**

**పార్టీకి చేటు చేస్తున్న నేతల ప్రకటనలు**

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 24**



అధికార కాంగ్రెస్పార్టీలో ధిక్కార స్వరాలు పెరుగుతున్నాయి. నాయకుల్లో అసహనం కట్టలు తెంచుకుంటున్నది. పవర్‌లోకి వచ్చామనే కంటే తమకు లాభం ఏమి జరగలేదని, తమ తర్వాత వచ్చిన వారికి పదవులు, ప్రాధాన్యత ఇస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటైనా పదవులు రాలేదని, గుర్తింపు ఇవ్వడం లేదని, పనులు కావడం లేదని, భవిష్యత్‌పై భరోసా లేదంటూ ఇలా ఒక్కొక్కరూ ఒక్కో సమస్య ఉందంటూ మీడియాకు ఎక్కుతున్నారు. దశాబ్దకాలం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్పార్టీకి ప్రతిపక్షం కంటే సొంత నేతలతోనే సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. పార్టీకి ప్రభుత్వానికి మధ్య సరైన సమన్వయం లేకపోవడం, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సీనియర్నేతలు ఇష్టారీతిన, క్రమశిక్షణ ఉల్లంఘించి బహిరంగంగా మాట్లాడినా వారిని పిలిపించి క్లాస్ పీకడంతో పాటు ఆ సమస్యను పరిష్కరించడం, రాజీ కుదర్చడం, వారికి నచ్చచెప్పే నాయకుడు లేకుండా పోయారని పార్టీలో ఆందోళన వ్యక్తమవుతోంది. పెద్దరికం చేసే నేతలు లేకపోవడం, ఈ పనిచేయాల్సిన ఏఐసీసీ పెద్దలు తెలంగాణలో జరుగుతున్న పరిణామాలపై అంతగా దృష్టి పెట్టకపోవడంతో అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతోందని చర్చ జరుగుతున్నది.

## ఘనంగా భక్తి శ్రద్ధలతో పూజలు

**మన దునియా, ఆగస్ట్ 24,మంచిర్యాల జిల్లా**



మంచిర్యాల జిల్లా మందమర్రి అంగడి బజార్‌లోని శివకేశ ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శివునికి ప్రత్యేక అన్నపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగగా, భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రావణమాసం సందర్భంగా మొదటి సోమవారం కూడా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించామని, రెండో సోమవారం కూడా కొనసాగిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రావణమాసంలో మిగిలిన మరో రెండు సోమవారాల్లో కూడా అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కార్యక్రమాలకు సహకరిస్తున్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సహకారంతో శ్రావణమాస పూజా కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు.

# పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం





**ప్రజావాణి ఫిర్యాదులు 32**

**సిపి సాయి చైతన్య : వెల్లడి**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

పోలీస్? ప్రజావాణిలో ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని సీపీ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులు 32 మంది బాధితుల నుంచి..కార్యాలయంలో సోమవారం 32 మంది బాధితుల నుంచి సీపీ ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచనలు చేశామన్నారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా




జిల్లా పోలీస్?శాఖ పనిచేస్తుందని సాయిచైతన్య పేర్కొన్నారు.

# 22-ఏ నిషేధిత భూముల జాబితాలో అవకతవకలా..





- **సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి -**

**- బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం**

**మన దునియా,ములుగు జిల్లా:ఆగస్టు 24**

22-ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు ములుగు జిల్లా కేంద్రంలోని నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సిహెచ్. మహేందర్ జీని బీజేపీ జిల్లా నాయకులతో కలిసి ఆయన కలిశారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరుతూ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. భూముల రికార్డుల పరిశీలన, నిషేధిత జాబితాలో చేర్చడం లేదా తొలగించడం వంటి అంశాల్లో నిబంధనలు ఉల్లంఘించారా అనే విషయాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని బీజేపీ నాయకులు కోరారు. విచారణలో అక్రమాలు బయటపడితే సంబంధిత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జవహర్ లాల్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవింద్రాచారి, గంగిశెట్టి రాజ్ కుమార్,మహిళా మోర్చా అధ్యక్షురాలు కొర్ర సుమలత, ఎస్సీ మోర్చా అధ్యక్షులు వావిలాల జనార్ధన్, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మాదరి శ్రీకాంత్, ములుగు మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు చల్ల రాంకీ ,శ్రీహరి,తదితరులు పాల్గొన్నారు

# ఎవరిది పైచేయి? వనపర్తిలో కాంగ్రెస్ వార్..

**ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే!**

**మన దునియా,వనపర్తి జిల్లా:ఆగస్టు 24**

వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లో విభేదాల చిచ్చు తారాస్థాయికి చేరింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్థానిక శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డిల మధ్య ఆధిపత్య సమరం చినికి చినికి గాలి వానలా మారింది. అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి రగిలిన పాత-కొత్త నేతల అంతర్గత పోరు ఒక్కసారిగా బహిర్గతమై అధిష్టానం గడప తొక్కింది. ఇటీవల గోపాల్‌పేట మండల కేంద్రంలో జరిగిన సభలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనానికి తెరలేపాయి ప్రతిపక్ష పార్టీల నుంచి వచ్చే విమర్శల కన్నా సొంత పార్టీకి చెందిన చిన్నారెడ్డి విమర్శలు చేయడాన్ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మరుసటి రోజే ఆధారాలతో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ మల్లురవికి , రెండు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర ముఖ్య నేతలకు ఫిర్యాదులు చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న చిన్నారెడ్డి పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు డాక్టర్ చిన్నారెడ్డి వర్గీయులు గాంధీభవన్‌కు చేరుకొని పార్టీ కోసం గత 40 సంవత్సరాల నుంచి పని చేస్తూ వచ్చిన తమకు కాకుండా కొత్తగా వచ్చిన వాళ్ళకి పదవులను ఎమ్మెల్యే కట్టబెడుతున్నారని ఫిర్యాదులు చేసి చిన్నారెడ్డికి మద్దతు పలికారు.

కాంగ్రెస్ నాకు దేవాలయం..

క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నోటీసుపై చిన్నారెడ్డి స్పందిస్తూ.. కాంగ్రెస్ తనకు దేవాలయం లాంటిదని, కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పడమే తప్ప అధిష్టానాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే పార్టీ కోసం సంవత్సరాల తరబడి పనిచేసిన వారిని పట్టించుకోకుండా కొత్తగా వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడాన్ని విమర్శించాను అని తన లేఖలో పేర్కొన్నారు. ఈ వివరణను ఎమ్మెల్యే మేఘా రెడ్డి కొట్టిపారేస్తూ 90 శాతం పాత కార్యకర్తలకే తాను న్యాయం చేశానని, అసలు కాంగ్రెస్ ముసుగులో ఇతర పార్టీల వారితో ఎవరు కుమ్మక్కవుతున్నారో బయటపెట్టాలని ప్రతి సవాల్ విసిరారు. చిన్నారెడ్డి వెంబడి ఏ పార్టీ వాళ్లు తిరుగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఓసీలు.. ఇతర పనులు ఏ పార్టీ వారికి చేశారో తేల్చాలి అని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. గాంధీభవన్ కు వచ్చిన వారిలో ఏ పార్టీ వారు ఉన్నారు గుర్తించాలన్నారు. వనపర్తి కాంగ్రెస్ లో జరుగుతున్న పరిణామాలు ఎక్కడికి దారితీస్తాయో అని ఆ పార్టీ శ్రేణులే కాకుండా ఉమ్మడి రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు



# బీజేపీలో హాట్ టాపిక్ ఇద్దరికి కేంద్ర మంత్రి పదవులు ?

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 24**

తెలంగాణా బీజేపీకి జాతీయ కార్యవర్గం పదవుల విషయంలో అన్యాయం జరిగింది అన్న భావన ఉంది. గతంలో పదవులు నిర్వహించిన వారికి కూడా ఈసారి అవకాశం దక్కలేదు సరికదా కొత్త వారిని ఎవరినీ తీసుకోలేదు.దీంతో తెలంగాణా బీజేపీ నేతలు లేకుండా బీజేపీ జాతీయ కార్యవర్గం కూర్పు జరిగిపోయింది. అదే సమయంలో ఏపీకి మంచి ప్రాధాన్యత ఇచ్చారు. ఏపీ కంటే తెలంగాణాలోనే బీజేపీకి బలం ఉంది. ఎనిమిది మంది ఎంపీలు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న తెలంగాణాలో బలమైన నాయకులు ఎంతో మంది ఉన్నారు. 2028 ఎన్నికల్లో తెలంగాణాలో అధికారంలోకి రావాలని గట్టిగా తలపోస్తున్న కమల నాధులు ఇలా ఎందుకు చేశారు అని తెలంగాణా బీజేపీ నేతలు అంతా తీవ్రంగా చర్చిస్తున్నారు. బీజేపీలో అంతర్మధనం పెద్ద ఎత్తున సాగుతోంది.

**బహుశా అదే కావచ్చు :**

అయితే అంతలోనే తేరుకుని ఉందిలే మంచి కాలం అని బీజేపీ నేతలు తమకు తాముగా చెప్పుకుంటున్నారు. పెద్ద పదవులు ఇచ్చేందుకే ఇలా చేశారు అని సర్ది చెప్పుకుంటున్నారు. ఇంతకీ ఆ పెద్ద పదవులు ఏమిటి అంటే కేంద్ర మంత్రి వర్గ విస్తరణ తొందరలో జరగబోతోంది కాబట్టి అందులో కచ్చితంగా మరో రెండు బెర్తులు తెలంగాణాకు దక్కుతాయని భారీ ఆశలను బీజేపీ నేతలు పెంచుకుంటున్నారు. పార్టీ పదవులు దక్కపోవడం వెనక ఇదే కారణం అయి ఉంటుందని అంచనాకు వస్తున్నారు. అదే జరిగితే తమకు దశ తిరిగినట్లే అని కూడా వారు ఊహించుకుంటున్నారని ప్రచారం సాగుతోంది.

**కచ్చితంగా ఇస్తారంటూ :**

బీజేపీకి దక్షిణాన కర్ణాటక తరువాత తెలంగాణాలోనే ఆశలు ఎక్కువగా ఉన్నాయని కూడా అంటున్నారు. దక్షిణాదికి గేట్ వేగా తెలంగాణాను బీజేపీ పెద్దలు పదే పదే చెబుతూ వచ్చారని అంటున్నారు. ఇక జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉన్నాయని 2028లో అసెంబ్లీ ఎన్నికలు 2029లో లోక్ సభ ఎన్నికలు ఉన్నాయని కూడా అంటున్నారు. దాంతో బీజేపీ బలపడాలి అంటే మరింత మందికి కేంద్ర మంత్రి పదవులు లభిస్తాయని కూడా లెక్క వేసుకుంటున్నారు.

**ఆమెకు ఖాయమేనా :**

ఇదిలా ఉంటే కేంద్ర మంత్రి పదవుల రేసులో మహబూబ్ నగర్ ఎంపీ మాజీ రాష్ట్ర మంత్రి డీకే అరుణ ముందు వరుసలో ఉన్నారని అంటున్నారు. ఆమెకు తాజాగా ప్రకటించిన జాతీయ కార్యవర్గంలో జాతీయ ఉపాధ్యక్ష




పదవిని తీసేశారు. దాంతో ఆమెకు కేంద్ర మంత్రి పదవి ఇస్తారనడానికి ఇది సంకేతంగా చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది కూడా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కావడంతో పాటు అదే సామాజిక వర్గానికి అదే జిల్లాకు చెందిన అరుణకు కేంద్ర మంత్రి పదవి ఇస్తే కనుక తప్పనిసరిగా బీజేపీ అక్కడ పుంజుకుంటుందని కేంద్ర పెద్దలు భావిస్తున్నారు అని విశ్లేషిస్తున్నారు. దాంతో ఎపుడు విస్తరణ జరిగినా అరుణకు పదవి ఖాయమని అంటున్నారు.

**ఈ ఇద్దరిలో ఒకరికి :**

అంతే కాదు బీఆర్ఎస్ లో పునాది నుంచి ఉన్న మాజీ రాష్ట్ర మంత్రి ఈటెల రాజేందర్ బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా ఒకసారి నెగ్గారు. బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన ఈటెల రాజేందర్ కి కేంద్ర మంత్రి పదవి ఇస్తే బీసీ వర్గాలు చేరువ అవుతాయని కేంద్ర పెద్దలు చూస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు బీఆర్ఎస్ నుంచి మరింత మందిని ఈ వైపుగా ఆకర్షించేందుకు వీలు అవుతుందని కూడా అంచనా కడుతున్నారు. ఒక వేళ ఏ కారణం చేతనైనా ఆయనకు పదవి ఇవ్వకపోతే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కి కేంద్ర మంత్రి పదవి దక్కడం ఖాయమని అంటున్నారు. ఆయన కూడా బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు అని అంటున్నారు. ఫైర్ బ్రాండ్ గా పేరున్న ఆయనకు ఇస్తే జిల్లాలో మరింతగా బీజేపీ బలపడడంతో పాటు కాంగ్రెస్ నుంచి నేతలను ఆకట్టుకోవడం సులువు అవుతుందని కూడా భావిసున్నారుట. మొత్తానికి తెలంగాణా బీజేపీలో కేంద్ర మంత్రి పదవుల మీద హాట్ డిస్కషన్ అయితే సాగుతోంది.

# ఏమి కొనేటట్టు లేదు..! ఏమి తినేటట్టు లేదు..!!

**ఆకాశాన్నంటుతున్న నిత్యవసర సరుకుల ధరలు..!**

**కిలో 70 రూపాయలు దాటుతున్న చక్కర..!**

**ఉల్లీది అదే పరిస్థితి..!?**

**బ్రేకులు లేకుండా పెరుగుతున్న రేట్లు..! చాలా వాటికి బ్రేక్ లేస్తున్న ప్రజలు..!!**

**ఆదాయం తక్కువ.. వ్యయం ఎక్కువైతే ఎలా అని ప్రశ్నిస్తున్న మధ్యతరగతి ప్రజలు**

**మా బతుకులు మరింత భారంగా మార్చొద్దు అంటూ వేడుకలు..!**

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 24**

రెక్కాడితే డొక్కాడుతుందో లేదో తెలియదు కానీ.. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరలను చూస్తే మాత్రం రెక్కా డొక్కా రెండో ఆడకపోవడం ఖాయంగా కనిపిస్తుంది...! తిండి తినాలంటే వస్తువులు కావాలి.. ఆ వస్తువులను కొనుగోలు చేయాలంటే డబ్బు కావాలి.. అంత డబ్బు పెట్టి కొనుగోలు చేసి తినే శక్తి తమకు లేకుండా పోతుందని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. రోజురోజుకు పలు రకాల నిత్యవసర సరుకులు ధరలు ఆకాశానందుతున్నాయని, ఏం కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదని బాధపడుతున్నారు. చాలీచాలని సంపాదనతో పెరుగుతున్న ధరలను ఎలా తట్టుకోవాలని మదన పడుతున్నారు. కొనబోతే కొలిమి అన్న చందంగా తమ పరిస్థితి తయారయిందని పేర్కొంటున్నారు. ప్రతిరోజు అవసరమయ్యే కూరగాయలు మొదలుకొని పప్పు దినుసులు, బియ్యం, పెట్రోల్ ధరల వరకు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలకు బ్రేకులు లేకుండా పెరుగుతుండడంతో అనేక రకాల వస్తువుల కొనుగోలుకు తాము బ్రేకులు వేయాల్సిన పరిస్థితి దాపురించిందని చింతిస్తున్నారు.

ఏమి కొనేటట్టు లేదు.. ఏమి తినేటట్టు లేదు..!

మార్కెట్లో ప్రస్తుతం నిత్యవసర సరుకులతో పాటు ప్రతి వస్తువు యొక్క ధరలు పెరిగిపోతుండడంతో అంతంత మాత్రమే సాగుతున్న సంసారాలను ఎలా ఈడ్చుకు రావాలో అర్థం కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూడబెట్టడం దేవుడెరుగుని, ఆదాయ వ్యాయాలకు పొంతన లేకుండా పోతుందని అంటున్నారు. ధరలను చూసి చాలా వస్తువులను వదులుకోవాల్సి వస్తుందని, ఏది కొనాలన్నా భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నట్టుండి రేటు మార్కెట్లో పెంచడం వల్ల తమ కొనుగోలు శక్తి ఎలా పెరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. ధరల సమతుల్యత దెబ్బతింటే మధ్యతరగతి ప్రజల నడ్డి విరగడం ఖాయమని భావిస్తున్నారు. మార్కెట్లో ఏ సరుకును కొనాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన అవసరం ఏర్పడిందని అభిప్రాయపడుతున్నారు.

ఆకుకూరలు మొదలుకొని అన్నిటికి రెక్కలు..!?

ప్రస్తుతం అన్ని రకాల ఆకుకూరలతో పాటు కూరగాయలకు ధరలకు కూడా రెక్కలు వచ్చేశాయి. అలాగే వంటనూనె ధరలు కాస్లీ అయిపోయాయని, ఏం కొనాలన్నా బడ్జెట్ ని చూస్తే భయమేస్తుందని బాధపడుతున్నారు. ఉల్లిగడ్డ రేటు రోజురోజుకు పెరిగిపోతుందని, త్వరలో దాని రేటు సెంచరీ కావడం ఖాయమని భావిస్తున్నారు. ఆదాయానికి మించిన ధరలు నిత్యవసర సరుకులకు పెరగడంతో తాము పస్తులు ఉండాల్సిన పరిస్థితులు తలెత్తే ఆస్కారం ఉందని అంటున్నారు. మార్కెట్లో దళారుల పెత్తనం పెరగడం వల్ల రైతులకు కూడా పెద్దగా లాభం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరలను చూస్తుంటే రోజురోజుకు ప్రజల కొనుగోలు శక్తి తగ్గి ద్రవ్యల్గుణం ఏర్పడే ఆస్కారం ఉందని పలువురు ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.!

ప్రజల కొనుగోలు శక్తిని పట్టించుకోండి

రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకులు సామాన్యుడి నడ్డి విరిచే విధంగా ఉందని, ప్రజల యొక్క కొనుగోలు శక్తిని కూడా దృష్టిలో పెట్టుకుని మార్కెట్లో నిత్యవసర సరుకులు ధరలు ఉంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని కోరుతున్నారు. ఇష్టానుసారంగా నిత్యవసర సరుకుల ధరలు పెరిగిపోతుంటే తాము బతికి బట్ట కట్టేది ఎలా అని నిలదీస్తున్నారు. మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులను నియంత్రించాల్సిన అధికార వ్యవస్థ, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రానున్న మరికొన్ని రోజుల్లో నిత్యవసర సరుకులు ధరలతో పాటు మరిన్ని వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పెట్రోల్ 120 రూపాయలకు చెరువులో ఉందని, అది కూడా పెరిగే ఆస్కారం లేకపోలేదని పేర్కొంటున్నారు. వంటగ్యాస్ ధర ఆల్రెడీ 1000 రూపాయల అయిందని, ప్రతినిత్యం నిత్యవసర సరుకులు లేనిదే సంసారం గడవదని, అలాంటి సరుకుల ధరలు అవకాశాన్నింటితే తాము ఎలా ముందుకు సాగేదని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సామాన్యుడికి అందుబాటులో ధరలు ఉండే విధంగా చూడాలని, ద్రవ్యోల్బణం ఏర్పడకుండా కట్టడి చేయాలని మెజార్టీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## ఆట కాసేపట్లో ముగుస్తుందనగా.. రెండు వికెట్లు తీసి లంకను దెబ్బకొట్టిన భారత్




కొలంబోలోని సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ (115 నాటౌట్) అద్భుత శతకంతో కదంతొక్కగా, రిషభ్ పంత్ (63) తనదైన శైలిలో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 503/9 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం, వెలుతురు మందగించిన పరిస్థితుల్లో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను భారత బౌలర్లు దెబ్బకొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి లంక కేవలం మూడు ఓవర్లలో 8 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ప్రస్తుతం భారత్ కంటే 495 పరుగులు వెనుకబడి ఉంది.అంతకుముందు, రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అరంగేట్ర ఆటగాడు సారాంశ్ జైన్‌ను లంక పేసర్ అసిత్ ఫెర్నాండో తన పదునైన బౌన్సర్‌తో బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్, నిలకడగా ఆడుతున్న జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. తొలి రోజు గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన పంత్.. తిరిగొచ్చాక లంక బౌలర్ల షార్ట్ బాల్ వ్యూహాన్ని సమర్థంగా ఎదుర్కొన్నాడు. తనదైన విధ్వంసక శైలిలో ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలో లహిరు కుమార బౌలింగ్‌లో అతను కొట్టిన ఒక భారీ సిక్సర్ స్టేడియం పైకప్పును దాటి, సోలార్ ప్యానెల్‌ను ధ్వంసం చేసింది. దీంతో బంతిని మార్చాల్సి వచ్చింది.పంత్ దూకుడుకు జురెల్ నిలకడ తోడవడంతో భారత్ లంచ్ సమయానికి పటిష్ట స్థితిలో నిలిచింది. పంత్ 21వ టెస్టు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా, జురెల్ తన మూడో అర్ధశతకాన్ని నమోదు చేశాడు. అయితే, లంచ్ విరామం తర్వాత తొలి బంతికే పంత్ అవుటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన మానవ్ సుతార్‌తో కలిసి జురెల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వర్షం కారణంగా సుమారు రెండు గంటల పాటు ఆట నిలిచిపోయినప్పటికీ, జురెల్ ఏకాగ్రత కోల్పోలేదు. ఆట పునఃప్రారంభమైన తర్వాత ఫెర్నాండో బౌలింగ్‌లో అద్భుతమైన డ్రైవ్‌తో పరుగు పూర్తి చేసి తన రెండో టెస్టు సెంచరీని అందుకున్నాడు. శ్రీలంక గడ్డపై అతనికి ఇదే తొలి శతకం. సెంచరీ పూర్తి కాగానే అతను తన చేతిపై ఉన్న ‘జై జవాన్, జై కిసాన్’ అనే టాటూను ప్రదర్శిస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడి జట్టు స్కోరును 500 పరుగులు దాటించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెంటనే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి లంక బ్యాటర్లను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. వెలుతురు మందగిస్తున్న క్లిష్ట సమయంలో బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంకను భారత బౌలర్లు వెంటనే దెబ్బకొట్టారు. ప్రసిద్ధ్ కృష్ణ తన రెండో బంతికే లహిరు ఉడార (1)ను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత చివరి ఓవర్ చివరి బంతికి మానవ్ సుతార్.. నైట్ వాచ్‌మెన్ ప్రభాత్ జయసూర్యను ఎల్బీడబ్ల్యూగా వెనక్కు పంపాడు. దీంతో అంపైర్లు వెలుతురు లేమి కారణంగా రెండో రోజు ఆటను నిలిపివేశారు. ఈ మ్యాచ్‌లో భారత్ పూర్తి పట్టు సాధించి విజయానికి బలమైన పునాది వేసుకుంది.

సంక్షిప్త స్కోర్లు:

భారత్ తొలి ఇన్నింగ్స్: 503/9 డిక్లేర్డ్ (దేవదత్ పడిక్కల్ 117, ధ్రువ్ జురెల్ 115లి; అసిత్ ఫెర్నాండో 4/106)

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: 8/2 (ప్రసిద్ధ్ కృష్ణ 1/1, మానవ్ సుతార్ 1/6)

## జూరెల్ అద్భుత సెంచరీ.. 503/9 వద్ద భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్డ్

కొలంబోలోని సింహలీస్ స్పోర్ట్స్ క్లబ్ గ్రౌండ్‌లో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో భారత్ పట్టు బిగించింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జూరెల్ (115 నాటౌట్) అద్భుత సెంచరీతో కదం తొక్కడంతో టీమిండియా తన తొలి ఇన్నింగ్స్‌ను 138 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 503 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అంతకుముందు దేవదత్ పడిక్కల్ (117) కూడా శతకంతో రాణించడంతో లంక ముందు భారత్ భారీ ఆధిక్యాన్ని ఉంచేందుకు మార్గం సుగమం చేసుకుంది.రెండో రోజు ఆటకు వర్షం కారణంగా అంతరాయం కలిగింది. తిరిగి ఆట మొదలయ్యే సమయానికి జూరెల్ 95 పరుగులతో తన తొలి టెస్టు శతకానికి కేవలం ఐదు పరుగుల దూరంలో ఉన్నాడు. మహమ్మద్ సిరాజ్‌తో కలిసి ఇన్నింగ్స్ పునఃప్రారంభించిన జూరెల్.. సెంచరీ కోసం ఆచితూచి ఆడాడు. సింగిల్స్‌ను కట్టడి చేసేందుకు లంక ఫీల్డర్లు చుట్టూ మోహరించినా, జూరెల్ సంయమనం కోల్పోలేదు. దాదాపు 22 బంతుల నిరీక్షణ తర్వాత ఫెర్నాండో బౌలింగ్‌లో బంతిని బౌలర్ తల మీదుగా డ్రైవ్ చేసి, వేగంగా పరుగెత్తి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో రనౌట్ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. సెంచరీ పూర్తి కాగానే తన చేతిపై ఉన్న ‘జై జవాన్, జై కిసాన్’ అనే టాటూను చూపిస్తూ అభివాదం చేయడం ప్రత్యేకంగా నిలిచింది.శతకం పూర్తయ్యాక జూరెల్ తన దూకుడు పెంచాడు. ఫెర్నాండో బౌలింగ్‌లో లాంగ్-ఆన్ మీదుగా భారీ సిక్సర్ బాదాడు. మరోవైపు, 29 బంతులు ఆడిన సిరాజ్‌ను ప్రభాత్ జయసూర్య ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. భారత్ తీసుకున్న రివ్యూ విఫలమైంది. అనంతరం క్రీజులోకి వచ్చిన ప్రసిద్ధ్ కృష్ణతో కలిసి జూరెల్ తన జోరు కొనసాగించాడు. ఫెర్నాండో బౌలింగ్‌లోనే డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ మీదుగా మరో సిక్సర్ కొట్టాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ కవర్స్ మీదుగా ఫోర్ కొట్టడంతో భారత స్కోరు 500 మార్కును దాటింది. వెంటనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తున్నట్లు సంకేతాలిచ్చాడు.ఈ ఇన్నింగ్స్‌లో జూరెల్ లోయర్ ఆర్డర్‌తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా రిషభ్ పంత్ (63)తో కలిసి 112 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం విశేషం. శ్రీలంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో 106 పరుగులిచ్చి 4 వికెట్లతో సత్తా చాటగా, ప్రభాత్ జయసూర్య, కేశార నువంత రెండేసి వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఆట ముగియడానికి సుమారు గంట సమయం ఉండగా, శ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## ఓ ఇంటివాడైన టాలీవుడ్ నటుడు ప్రిన్స్.. న్యూజిలాండ్ లో ఘనంగా వివాహం



టాలీవుడ్ యంగ్ హీరో ప్రిన్స్ సెసిల్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రియురాలు సాయి ప్రతిమ మెడలో మూడు ముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. న్యూజిలాండ్‌లోని వనాకా ప్రాంతంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.వివాహ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మహారాణిలా మెరిసిపోగా, వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించాడు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నూతన జంటకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు.వీరిద్దరి ప్రేమకథ కూడా ఎంతో ఆసక్తికరంగా మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ వివాహ వేడుకలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, ఆపై ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు చేరింది.'నీకు నాకు డ్యాష్ డ్యాష్' చిత్రంతో హీరోగా పరిచయమైన ప్రిన్స్, 'బస్ స్టాప్' సినిమాతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'బిగ్ బాస్ తెలుగు' మొదటి సీజన్‌లో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఇటీవల 'డీజే టిల్లు', 'స్కంద' వంటి విజయవంతమైన చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ నటుడిగా తనను తాను నిరూపించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రిన్స్ మరికొన్ని ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.

## చివరిదాక... కేసీఆర్!: రాహుల్ రామకృష్ణ పోస్ట్ వైరల్

సంచలనంగా మారిన రాహుల్ రామకృష్ణ ట్వీట్

మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

గతంలో కూడా సంచలనం సృష్టించిన రాహుల్ ట్వీట్లు

టాలీవుడ్ విలక్షణ నటుడు రాహుల్ రామకృష్ణ ఎక్స్ వేదికగా చేసిన ఒక పోస్ట్ వైరల్ అవుతోంది. తన రాజకీయ, సామాజిక అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు బయటపెట్టే రాహుల్... తాజాగా "చితి చివరిదాక... కేసీఆర్!" అని పోస్ట్ చేయడంతో ఈ వ్యవహారం రాజకీయంగా, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.పోస్ట్ ఏ సందర్భాన్ని పురస్కరించుకుని చేశారనే దానిపై స్పష్టత లేనప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. బీఆర్ఎస్ మద్దతుదారులు, కేసీఆర్ అభిమానులు ఈ పోస్టును రీట్వీట్ చేస్తూ మద్దతు తెలుపుతుండగా, మరికొందరు నెటిజన్లు అతడిపై వైఖరిపై విమర్శలు గుప్పిస్తున్నారు.రాహుల్ రామకృష్ణ రాజకీయ అంశాలపై స్పందించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో జనసైనికుల నుంచి తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ ఎదుర్కొన్నాడు. అలాగే గతంలో తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులపై కేసీఆర్, కేటీఆర్‌లను ట్యాగ్ చేస్తూ చేసిన పలు ట్వీట్లు కూడా తీవ్ర సంచలనం సృష్టించాయి.'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం', 'బ్రోచేవారెవరురా', 'జాతి రత్నాలు', 'ఆర్ఆర్ఆర్', 'ఓం భీమ్ బుష్' వంటి చిత్రాల్లో తన ప్రత్యేకమైన కామెడీ, సంభాషణలతో అలరించిన రాహుల్ రామకృష్ణ... నటుడిగానే కాకుండా రచయితగా కూడా మంచి గుర్తింపు పొందాడు.





## మిస్ యూనివర్స్ వేదికను సుస్మితా సేన్ తో పంచుకోవడంపై ఊర్వశి రౌతేలా ఎమోషనల్

నటి, మాజీ అందాల రాణి ఊర్వశి రౌతేలా మరోసారి వార్తల్లో నిలిచారు. మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు ఆమె వరుసగా నాలుగోసారి న్యాయనిర్ణేతగా వ్యవహరించి ప్రత్యేకతను చాటుకున్నారు. అయితే, ఈసారి ఈ కార్యక్రమం ఆమెకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం అయింది. తన కెరీర్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన, తన గురువుగా భావించే సుస్మితా సేన్‌తో వేదిక పంచుకోవడంతో ఊర్వశి భావోద్వేగానికి గురయ్యారు.ఈ సందర్భంగా తన గురువు సుస్మితా సేన్‌తో ఉన్న అనుబంధాన్ని ఊర్వశి పంచుకున్నారు. "నా మొదటి మెంటర్, నా గురువు, మన దేశపు తొలి మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో ఈ క్షణాలను పంచుకోవడం అనంతమైన ఆనందాన్ని ఇస్తోంది. నాకు ఎగరడానికి రెక్కలిచ్చిన మహిళ ఆమె. సాధారణంగా ఆమె ఎవరికీ అలా చేయరు, కానీ నా పట్టాభిషేకం రోజున స్వయంగా ఆమే నాకు కిరీటాన్ని అలంకరించారు. అది నా జీవితంలో అత్యంత మధురమైన, మరచిపోలేని క్షణాల్లో ఒకటి" అంటూ ఊర్వశి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.సుస్మితా సేన్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ఊర్వశి తెలిపారు. "ఆమె నాపై ఎందుకు అంత నమ్మకం ఉంచిందో ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది. కానీ కొన్ని ఆశీర్వాదాలకు వివరణలు ఉండవేమో, వాటిని ఆస్వాదించాలి అంతే. దేవుడికి, నా తల్లిదండ్రులకు, కుటుంబానికి, అభిమానులకు, ముఖ్యంగా నా గురువు సుస్మితకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. నా కృతజ్ఞతను మాటల్లో చెప్పలేను. కొన్ని కలలు నెరవేరతాయి, మరికొన్ని ఊహకు మించి ఉంటాయి. ఇది రెండో కోవకు చెందింది" అని ఆమె ఉద్వేగంగా మాట్లాడారు.ఇక ఈ కార్యక్రమంలో ఊర్వశి ధరించిన త్రివర్ణ పతాకం గౌను ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని గురించి ఆమె మాట్లాడుతూ, "వరుసగా నాలుగోసారి మిస్ యూనివర్స్ ఇండియాకు జడ్జిగా వ్యవహరించడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించినట్లు మా టీమ్ చెప్పింది. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'నేను ఇండియన్' అని చెప్పాను. ఇప్పుడు ఈ త్రివర్ణ పతాక గౌనులో మిస్ యూనివర్స్ ఇండియాకు జడ్జిగా వ్యవహరిస్తుంటే, ఆ మాటలకు మరింత అర్థం చేకూరినట్లు అనిపిస్తోంది. భారతీయురాలిగా పుట్టినందుకు గర్వపడుతున్నాను" అని ఊర్వశి తన దేశభక్తిని చాటుకున్నారు.

## ఆత్మకథగా రజనీకాంత్ ప్రస్థానం.. అధికారికంగా ప్రకటించిన కుమార్తె సౌందర్య

సూపర్‌స్టార్ రజనీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని, జీవిత అనుభవాలను పుస్తక రూపంలో అభిమానులకు అందించబోతున్నారని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య రజనీకాంత్ వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె... ఆ పుస్తకం తయారీ ప్రాసెస్ చాలా ప్రత్యేకంగా సాగుతోందని తెలిపారు.రజనీకాంత్ ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలోని విజయాలు, వ్యక్తిగత అనుభవాలు, అగ్రస్థానానికి చేరుకునే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లతో ఈ పుస్తకం రూపుదిద్దుకుంటోంది. పరమహంస యోగానంద రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకంలాగే ఈ పుస్తకం కూడా తరతరాలకు స్ఫూర్తినిస్తుందని సౌందర్య నమ్మకం వ్యక్తం చేశారు.ఒకవేళ తన తండ్రి జీవితాన్ని సినిమాగా తెరకెక్కించే అవకాశం వస్తే అది తనకు అత్యంత ప్రత్యేకమైన విషయమని ఆమె తెలిపారు. సృజనాత్మకతకు స్పష్టత, క్రమశిక్షణ చాలా ముఖ్యమని తన తండ్రి నేర్పించారని పేర్కొన్నారు. ప్రస్తుతం సౌందర్య నిర్మాణంలో నెట్‌ఫ్లిక్స్ కోసం 'లవ్' అనే రొమాంటిక్ తమిళ వెబ్‌సిరీస్ రూపొందుతోంది. బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రలు పోషిస్తుండగా... ఇది అక్టోబరులో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com